జ్ఞాపికలు

రామనాథానికి ఎవరో తట్టి లేపినట్టు మెలకువ వచ్చింది.

ప్రతిరోజూ ఇదే వేళకి మెలకువ వస్తుందతనికి. తనకి కుడివైపు వున్న కిటికీలోంచి బయటికి చూస్తాడు. ఎదురింటిలో అప్పటికే దీపాలు వెలుగుతూ వుంటాయి. పిల్లలు వరండాలో చదువుతూ కనిపిస్తారు. తన గదిలో ఆకుపచ్చగా వెలుగుతోన్న జీరో బల్బు చిరు వెలుతుర్లోనే గోడ గడియారాన్ని చూస్తాడు. అది అయిదుగంటలయినట్టు టైము చూపిస్తుంది. వెంటనే లేచి, ట్యూబులైటు వేసీ, బాత్‌రూమ్‌కు వెళ్ళి వచ్చీ ఆఫీసు నుంచీ తెచ్చుకున్న ఫైళ్ళను రాయడానికి ఉపక్రమిస్తాడు.

ఆరున్నర అవుతున్నట్టే బెడ్ కాఫీ ఇస్తుంది అతని భార్య పద్మావతి. పెన్నుని కింద పెట్టకుండానే కాఫీ తాగేసి, ఏడు గంటలవరకూ అలా ఫైళ్ళను రాస్తూనే వుంటాడు. ఆ తర్వాత కాలకృత్యాలు తీర్చుకునీ, స్నానం చేసీ, అరగంట పూజ చేసుకుని, ఎనిమిదిన్నరకల్లా ఫైళ్ళతో ఆఫీసు చేరుకుంటాడు. అప్పటికి అక్కడ వాచ్‌మేన్ మాత్రమే వుంటాడు – నేరుగా తన సీటు దగ్గరకెళ్ళి బీరువా తెరుస్తాడు. పైనుంచీ రెండవ అరలో ఓ మూలన కొలువయి వున్న ఏడు కొండలవాడి పటానికి రెండు క్షణాలు మొక్కుకునీ అప్పుడు ఫైళ్ళు రాయడం మొదలుపెడతాడు. అప్పణ్ణించీ రాసీ రాసీ, మధ్యలో ఒకటిన్నర ప్రాంతంలో ఇంటినుంచి అటెండరు తెచ్చిన క్యారియర్ని ఖాళీ చేస్తాడు. మళ్ళీ ... ఇక ఫైళ్ళు రాయడమే! అలా రాత్రి ఎనిమిదిన్నర గంటల వరకూ రాసీ, ఫైళ్ళతోనే ఇల్లు చేరుకుంటాడు. భోజనానంతరం ఒక గంటసేపయినా ఫైలు రాయందే అతనికి నిద్రపట్టదు మరి! ఇంచుమించూ అతని ముప్పయ్యేళ్ళ సర్వీసులోని దినచర్య ఇదీ!

ఇందులో ఆదివారాలూ, సెలవుదినాలూ, పండగలూ, పబ్బాలూ పెద్ద మినహాయింపేమీ కావు!

అయితే –

ఇదంతా గత కాలానికి సంబంధించిన గుర్తులుగా మిగిలిపోతున్నాయి ఇవాల్టితో ...

అవునూ ...

నిన్ననే రామనాథం రిటయిరయ్యాడు!

నిన్న సాయంత్రం ఆర్డీవో ఆఫీసు మీటింగు హాలులో తన పదవీ విరమణ సభ జరిగింది. దాన్ని 'పదవీ విరమణ సభ' అనడం కంటే 'అభినందన సభ' అనడం సబబుగా వుంటుందేమో ననిపించేంత ఘనంగా జరిగింది!

ఆ ఆఫీసులో వున్న సీనియర్ మోస్టు డిప్యూటీ తాసిల్దారులలో రామనాథమే మొదటివాడూ, అందరి అభిమానానికి పాత్రుడూనూ. అతనంత అభిమానాన్ని సంపాదించుకోడానికి కారణం - ఆఫీసుకు సంబంధించిన ప్రతి సబ్జక్టూ, క్షుణ్ణంగా అవగాహన కలిగివుండటమే! ఎట్లాంటి కష్టతరమైన డ్రాఫ్టైనా అలవోగ్గా అటు ఆంగ్లంలోనూ, ఇటు తెలుగులోనూ రాసేయగలడు తను. అతనికున్న ఒక సుగుణం ఆఫీసులో అందరితోనూ కలివిడిగా మాట్లాడ్డమైతే, మరో సుగుణం ఎన్ని గంటలయినా సీటుకు అంటుకుపోయి ఫైళ్ళను రాస్తూ వుండిపోవడటమే! ఈ రెండు సుగుణాలనీ మించిన సుగుణం మరొకటి ఉంది. తనకున్న రెవిన్యూ విషయ పరిజ్ఞానంతో పై అధికారుల్ని ఇట్టే ఆకట్టుకోగలగటం! బంగారానికి పరిమళమబ్బి నట్టుగా ఈ సుగుణాలకి తోడుగా అతనికి అపారమైన జ్ఞాపకశక్తి వుంది. అది ఆఫీసులో అందర్నీ ఎప్పటికప్పుడు అబ్బురపరుస్తూ వుంటుంది. ఫలానా ఉద్యోగి సర్వీసు విషయంలో ఒక ఇబ్బంది వచ్చిందే అనుకోండి, దానికి సంబంధించిన డిస్పోజల్ ఏదయినా వుందా? అని ఎవరయినా రామనాథాన్ని అడిగితే, అతను తడుముకోకుండా ఆ డిస్పోజల్ ఎన్నేళ్ళ కిందటిదో, దాని నెంబరు చెప్పి, అది రికార్డు రూంకు ఎప్పుడు వెళ్ళిందో కూడా అవలీలగా చెప్పేసి, అందర్నీ చకితుల్ని చేయగలడు!

అందుకే - పదవీ విరమణ సభలో ఉద్యోగులంతా అతన్ని పూలమాలల్తో ముంచెత్తేరు. శాలువాలతో సత్కరించేరు. మెమెంటోలతో అభినందించేరు. తమ ప్రసంగాలలో అతను ఆఫీసుకీ, డిపార్టుమెంటుకీ చేసిన సేవని శ్లాఘించేరు! ఎన్నడూ ఒక్కమాటయినా మాట్లాడని ఆర్.డి.ఓ. (రెవిన్యూ డివిజనలు ఆఫీసరు) గారు కూడా రామనాథం గురించి మాట్లాడుతూ, 'తనకి కుడిభుజం పోయింది' అని గాద్గదిక స్వరంతో మాట్లాడుతోంటే పులకించిపోయేడు రామనాథం. తన సర్వీసులో అంకిత భావంతో పనిచేసిన మనుషుల్ని అతి కొద్దిమందినే చూశాననీ, వారిలో రామనాథమే మొదటివాడనీ - ఆయన చెబుతోంటే రామనాథం గుండె ఉబ్బిపోయింది. 'ఎవరయినా ఆఫీసరు పిలిస్తే పలుకుతారు. కానీ రామనాథం పిలవకనే పలుకుతాడు' అని ఆర్డీవో అన్నపుడు రామనాథం కళ్ళు చెమ్మగిల్లేయి! 'కంప్యూటర్లకి మించిన కంప్యూటర్ మనిషి మెదడు - అని సైంటిస్టులు అంటారు. అది రామనాథం విషయంలో నిజమైన నిజం! ఇంకా బాగా చెప్పాలంటే కంప్యూటర్నే మించిన బ్రెయిన్ రామనాథానిది అంటే, అతిశయోక్తి కాదేమో!' అంటూ ఆర్డీవోగారి ప్రసంగం కొనసాగుతూ వుండగా, కరతాళధ్వనులు మిన్నుముట్టేయి. అప్పుడు రామనాథం రెండు ఎవరెస్టులపై నిలుచున్నంత ఆనందంతో ఉప్పొంగిపోయేడు.

సభ అయిపోయేక అందరూ ఇంటివరకూ బేండు మేళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి తనని ఆత్మీయంగా విడిచివెళ్ళారు. బంధుమిత్రులతో ఇల్లంతా కళకళ లాడింది. అంత ఆనందాన్నీ మనసులో నింపుకునీ రాత్రి ఏ పన్నెండింటి వరకో తన భార్యతో ఆఫీసు విషయాల్నే ముచ్చటిస్తూ వుండిపోయేడు రామనాథం.

ఇట్లా ఆలోచనలతో పరవశించిపోతున్నాడతను ... అప్పుడే తను రిటైర్డు అయి ఒక్క రోజు గడిచిపోయింది! నిన్నటిదాకా డిప్యూటీ తహసిల్దారు తను! మరి ఈ

రోజు నించీ రిటైర్డు డిప్యూటీ తహసీల్దారు. ఆ మాట అనుకోగానే మనసులో నైరాశ్యం అలుముకుంది రామనాథానికి. నిన్నటిదాకా విరామమెరుగక పరిశ్రమించిన చేయి ఈవాల్టినుంచీ గడిచే రోజుల్నీ, గడవని కాలాన్నీ, పెన్షన్ డబ్బునీ లెక్కించటం కోసం ఉపయోగపడుతుంది! ఎంతలో ఎంత మార్పు!

"ఏమండీ కాఫీ!" అంటూ పద్మావతమ్మ పొగలుకక్కే పెద్ద కప్పును అందించింది.

నవ్వుతూనే బెడ్‌కాఫీని అందుకున్నాడు. పద్మావతమ్మ తనూ నవ్వేసి వెళ్ళిపోయింది ... గోడగడియారం ఆరున్నర అయినట్టు సూచిస్తోంది. అంటే తను గంటన్నర నించీ గత స్మృతులను నెమరేసుకుంటున్నాడన్నమాట!

నెమ్మదిగా కాఫీ తాగేసేడు ...

ఇంట్లోంచి చిన్న పిల్లల కేకలు, మరీ చిన్నపిల్లల ఏడుపులూ, పెద్దవాళ్ళ మాటలూ అన్నీ కలగాపులగంగా వినిపిస్తున్నాయి రామనాథానికి.

అబ్బో! చాలామంది బంధువులే వున్నట్టున్నారు. అసలు ఎవరెవరు వచ్చారో కూడా తను గమనించలేదు. నిజానికి రాత్రే అందర్నీ మాట్లాడించి వుండాల్సింది. అయినా తనకు వీలెక్కడుందీ? 'ఇవాళ మాట్లాడించేస్తే సరి' అని తనకు తనే సర్దిచెప్పుకున్నాడు రామనాథం.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు గదిలోంచి బయటికి వచ్చేడతను. ఎందుకో పక్కగదిలోకి చూసేడు. చామనఛాయలో వున్న ఓ నలభై సంవత్సరాల మనిషి గడ్డానికి బాగా సబ్బు నురగ దట్టించి, అద్దంలోకి చూస్తూ షేవ్ చేసుకోవడంలో నిమగ్నమయి వున్నాడు. ఒంటినిండా రోమాలున్నాయి. చారల లుంగీ మాత్రం కట్టుకుని ఉన్నాడతను. 'ఇతనెవరయి వుంటాడబ్బా!' అని ఒక్క క్షణకాలం ఆలోచించేడు. ఆ మాటే అతన్నడిగితే ఏమనుకుంటాడో...ఊహూ... మంచిదికాదు. తర్వాత పద్మని అడిగి తెలుసుకుంటే సరి. తను ఈ ముప్ఫయి ఏళ్ళలో ఎవరి పెళ్ళికిగానీ, ఏదన్నా ఫంక్షనుకి కానీ వెళ్ళి వుంటే ఎవరెవరు బంధువులు అన్న విషయం తెలిసుండేది. తనకి ఆఫీసే లోకమాయె! అలా అనుకుంటూ వుండగానే వంటింటివైపు నుంచీ పసిపిల్లల ఏడుపు వినిపించి, అప్రయత్నంగా ముందుకు అడుగువేసేడు. అతనలా వెళుతున్నట్టే ఏడుస్తోన్న పిల్లని సముదాయిస్తూ ఒక ఇరవయి అయిదేళ్ళ అమ్మాయి ఊయల వూపుతోంది. ఆమె రామనాథం వైపొకసారి చూసి నవ్వీ, పిల్ల ఏడుపు మరీ ఎక్కువకావడంతో నోటితో ఊ...ఊ...ఊ ... మంటూ ఊయల్ని మరింత వేగంతో ఊపసాగింది. "ఎవరమ్మా నువ్వూ?" అనడుగుదామని నాలిక చివరిదాకా వచ్చింది. 'వొద్దొద్దు...అట్లా అడిగి నా అమాయకత్వాన్ని బయట పెట్టుకోవడం ఎందుకూ?' అనుకుని ముందుకు నడిచేడు. అక్కడినించీ రెండు మూడు అంగల్లో వరండా వస్తుంది. అయితే తను వెళ్ళాల్సింది బాత్రూమ్‌కి కదా అన్న విషయం గుర్తొచ్చీ వెనక్కి తిరుగుతున్నవాడల్లా – వరండాలో పేపర్ని నిశితంగా చదువుతోన్న అద్దాల మనిషిని చూసేడు. అతనికి ముప్ఫయి అయిదేళ్లుంటాయి. బనియను, లుంగీలతో వున్నాడు. "మరి ఇతనెవరో!"...ఏమో... పద్మని అడిగితే సరి! అనుకుంటూ బాత్రూం వైపు వెళ్ళేడు. కాంపౌండులో

నలుగురు పిల్లలు బంతి ఆడుతూ కనిపించేరు అక్కడికి. 'ఆహా! నిజంగా పెళ్ళి ఇల్లులా వుంది!' అనుకుని సంబరపడిపోతూ బాత్రూంలోకి దూరిపోయేడు రామనాథం.

ఎనిమిది గంటలకల్లా స్నానాదులు పూర్తిచేసుకుని, తన గదిలోని మంచంపైనే కూచుని వున్నాడు. తనకి బాత్రూం నుంచీ వచ్చేటప్పుడు తటస్థపడ్డ మరి నాలుగు కొత్త ముఖాలు 'ఎవరా' అన్నది అతని మనసులో ఓవైపు మెదులుతూనే వుంది.

పెద్ద ప్లేటులో పద్మావతమ్మ వేడి వేడి ఇడ్లీలు తెచ్చింది – "మీకిష్టమని ఇడ్లీలూ, చెనిగిత్తనాల చెట్నీ చేసినా!" అందామె.

అతను మంచం మీద నుంచే ప్లేటు అందుకున్నాడు.

"పద్మా! నేను పొద్దిన్నించీ చూస్తున్న వాళ్ళంతా ఎవరూ?" అడిగేరు.

"ఎవరండీ?" అందామె కనుబొమ్మల్ని ముడివేసి.

ఇంతలో "బావా! బాగున్నావా?" అంటూ గదిలోకి దూసుకొచ్చేడు పరమేశం. అతను పద్మావతమ్మ చిన్న తమ్ముడు. హిందూపురంల్లోని బ్యాంకులో ఆఫీసరుగా పన్జేస్తున్నాడు.

'బావున్నాను' అన్నట్టు తలాడించి "రా. రా! టిఫిన్ చేద్దాం!" అన్నాడు రామనాథం.

"నాదయిందిలే ... నిన్న నీ రిటైర్మెంటు ఫంక్షనుకి రాలేకపోయినాను బావా! బాగా జరిగిందంట కదా!" అంటూ దగ్గరలోనే వున్న ఓ కుర్చీని లాక్కుని కూచున్నాడతను.

"నువ్వు రావాల్సిందిరా! ఎవురికేగాని అంత బాగా జరిగుండదు!" అంది పద్మావతమ్మ సంతోషంగా.

"సరేగానీ ... ఒరే పరమేశా! ప్రస్తుతం మనింట్లో కొన్ని కొత్త కొత్త మొఖాలు పొద్దన్నించీ చూస్తున్నాను, వాళ్లు ఎవరెవరో, నాకేమవుతారో కొంచెం పరిచయం చేయరా! ఏ పెళ్ళికన్నా, పేరంటానికన్నా వెళ్ళుంటేనా, నాకెవరన్నా పరిచయమయ్యేకి... మీ అక్కయ్యతో ఆ మాటే అడుగుతూ వుంటే నువ్వొస్తివి!" అన్నాడు దీనంగా మొహంపెట్టి.

"ఊ ... హూ ... ఇన్నాళ్ళకి మీకు మనుషులు కావాల్సొచ్చినారా? లేకుంటే ఫైళ్ళే జీవితం గదా!" అంది పద్మావతమ్మ చిరుకోపంతో.

"బాబ్బాబూ! పుణ్యముంటుంది పరిచయం చేయరా! మీ అక్కయ్య దెప్పిపొడుపులు మామూలే కదా!" అంటూ టిఫిన్ తింటున్నవాడల్లా బతిమాలుతున్నట్టు మొహం పెట్టేడు.

"సరే బావా! డోన్ట్‌వర్రీ!!" హామీ ఇచ్చేడు పరమేశం.

రామనాథం తినడంలో నిమగ్నమయిపోయేడు.

ఒకసారి అందర్నీ ఇక్కడికి తీసుకురమ్మని అక్కయ్యకి కళ్ళతోటే చెప్పి పంపేసేడు పరమేశం.

"బావా! నీ సర్వీసులో ఎక్కువ భాగం ఆర్డీవో ఆఫీసులోనే కదా!" అనడిగేడు పరమేశం.

"అవున్రా! 14 సంవత్సరాలా ఏడు నెలలా ఇరవై నాలుగు రోజులు పనిచేసినాను" అన్నాడు.

"ఎంతమంది ఆర్డీవోలు మారినారు?"

ఒక్క క్షణం ఆలోచించి – "ఫుల్ అడిషనల్ ఛార్జి ఆర్డీవోలతో సహా 18 మంది ఇప్పుడున్నది పందొమ్మిదో ఆర్డీవో..." చెప్పేడు రామనాథం.

"వాళ్ళ పేర్లు చెప్పగలవా బావా?"

రెండు క్షణాలు కళ్ళు మూసుకునీ, తెరిచాడు. ఇక చెప్పడం ప్రారంభించాడు రామనాథం – పరమేశం ఆశ్చర్యపోతున్నాడు.

"మరి సూపరెన్టెంటులూ?"

"ఇరవయి మందిరా"

"ఊ బాగుంది ... నీ పనితనాన్ని మెచ్చుకుని ఎన్నిసార్లు సర్టిఫికెట్లు ఇచ్చినారు?"

గోడలకి తగిలించి వున్న సర్టిఫికెట్లనీ, అభిమానంతో ఇచ్చిన జ్ఞాపికల్నీ తినడం ఆపి ఎంతో మురిపెంగా చూపించేడు రామనాథం.

ఈలోగా ఆ గదిలోకి కొత్తవాళ్ళందర్నీ పిల్లల్తో సహా తీసుకువచ్చింది పద్మావతమ్మ.

నలుగురు ఆడవాళ్ళూ, నలుగురు మగవాళ్ళూ, వాళ్ళ పిల్లలూ ... కుటుంబాల వారిగా, గ్రూప్ ఫొటోకి నిలబడ్డట్టు నవ్వు మొహాల్తో నిలబడ్డారు – నాలుగు జట్లుగా...

వాళ్ళందరివైపూ ఒకసారి చూసి బిత్తరపోయేడు రామనాథం. ఏం జరుగుతోందీ ... తను రహస్యంగా కనుక్కుందామనుకున్న విషయం కాస్తా బట్టబయలు అయిపోయేట్టు వుందే! ఇప్పుడేం చేయడం ...అనుకుంటూ వాళ్ళవైపు చూడనట్టు వుండాలని తంటాలు పడుతున్నాడు రామనాథం.

"బావా! ఇక్కడున్న వాళ్ళనేనా ఇందాకా నువ్వూ ..." అంటూ ఆపేశాడు పరమేశం.

'అవు' నన్నట్టు తల వూపి, పిల్లల వైపు చూస్తూ, వాళ్ళలో నవ్వుతున్న పాపని రమ్మన్నట్టు చేతులు చాచేడు రామనాథం.

ఆ పాప రానన్నట్టు తల ఆడించి, వాళ్ళమ్మ కుచ్చిళ్ళలో ఒదిగిపోయింది.

"ఇందాకా నీ సర్టిఫికెట్లూ, జ్ఞాపికలూ చూపించి మురిసిపోయావు కద బావా! మురిసిపోవాల్సింది – వీళ్ళని గురించీ ... నీ నిజమైన జ్ఞాపికలు వీళ్ళే ... అంటే నీ పిల్లలే వీళ్ళంతా ... వాడు పెద్దోడు రవి, వీడు రెండోవాడు సోము ... ఆమె పెద్దమ్మాయి దివ్య, ఇదేమో మీ చిన్నమ్మాయి రమ్య ..." అంటూ కోడళ్ళనీ, అల్లుళ్ళనీ, వాళ్ళ పిల్లల్నీ పేరుపేరునా పరిచయం చేసేడు పరమేశం. నోరు తెరిచి అట్లా వుండిపోయేడు రామనాథం.

(ఆదివారం ఆంధ్రజ్యోతి – 27 ఏప్రిల్, 1997)